

వన మహోత్సవంలో నాటిన మొక్కలను పరిశీలిస్తున్న డీఆర్‌డీవో పీడీ శ్రీలత

### మొక్కలు నాటే కార్యక్రమాన్ని
# పకడ్బందీగా చేపట్టాలి
### రంగారెడ్డి డీఆర్‌డీవో పీడీ శ్రీలత

ఇబ్రహీంపట్నం రూరల్, ఆగస్టు 8 : గ్రామీణ ప్రాంతాలతోపాటు అడవుల్లోనూ మొక్కలు నాటే కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని రంగారెడ్డి డీఆర్‌డీవో పీడీ శ్రీలత అన్నారు. గురువారం ఆమె మండలంలోని తులేకలాన్ గ్రామంలో కొనసాగుతున్న ఉపాధి హామీ, అటవీ శాఖ నర్సరీల్లో అందుబాటులో ఉన్న మొక్కలను పరిశీలించి మాట్లాడారు. వన మహోత్సవంలో గ్రామ స్థాయిలో యువజన సంఘాలు, గ్రామస్తులు, మహిళా సంఘాల సభ్యులు భాగస్వాములు కావాలని సూచించారు. తరిగిపోతున్న వనసంపదను పెంచేందుకే ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు.
శుక్రవారం చేపట్టనున్న వన మహోత్సవం కార్యక్రమానికి ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీడీ సక్రియానాయక్, ఏపీవో తిరుపతాచారి, పంచాయతీ కార్యదర్శి రవీందర్ తదితరులున్నారు.

### రాడార్ స్టేషన్ ఏర్పాటును
# ఉపసంహరించుకోవాలి



వికారాబాద్ అదనపు కలెక్టర్ లింగ్యానాయక్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

వికారాబాద్, ఆగస్టు 8 : రాడార్ స్టేషన్ ఏర్పాటు నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని పీవోడబ్ల్యూ జిల్లా కన్వీనర్ గీత, ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి మల్లేశ్ పేర్కొన్నారు. గురువారం వారు వికారాబాద్ కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్‌కు వినతి పత్రాన్ని సమర్పించి మాట్లాడుతూ.. పూడూరు మండలంలోని దామగుండం అడవిలో రాడార్ కేంద్రం ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడం సరైంది కాదన్నారు. అక్కడ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే 12 లక్షల చెట్లను తొలగించాల్సి వస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వం ఒకవైపు స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మొక్కలను నాటాలని విస్తృతంగా ప్రచారం చేస్తూ.. మరోవైపు దామగుండం అడవిలో రాడార్ కేంద్రం నిర్మాణానికి శరవేగంగా ఏర్పాట్లు చేస్తుండడం బాధాకరమన్నారు. అదనపు కలెక్టర్‌ను కలిసిన వారిలో దామగుండం అడవి నివాసి సత్యానందాస్వామి, ఏఐకేఎంఎస్ నాయకుడు రాములు, పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, పీఓడబ్ల్యూ నాయకురాలు ప్రభావతి తదితరులున్నారు.

### ఎల్జీబీటీ కమ్యూనిటీకి అండగా..
# ‘హోప్ ఇన్ ఏ కప్’ కేఫ్




ఓపెన్ టెక్స్ట్ కార్యాలయంలో హోప్ ఇన్ ఏ కప్ కేఫ్‌ను ప్రారంభిస్తున్న ప్రతినిధులు

కొండాపూర్, ఆగస్టు 8: ఎల్జీబీటీ కమ్యూనిటీకి మద్దతుగా ఓపెన్ టెక్స్ట్ నిలుస్తుందని ఈక్విటీ, డైవర్సిటీ, ఇన్‌క్లూజన్, ఓపెన్ టెక్స్ట్ వైస్ ప్రెసిడెంట్ వైవోన్ థామ్సన్ అన్నారు. హైటెక్ సిటీ రహేజా మైండ్‌స్పేస్ ఐటీ కారిడార్‌లోని ఓపెన్ టెక్స్ట్ కార్యాలయంలో ఎల్జీబీటీ కమ్యూనిటీకి మద్దతుగా, వారికి చేయూతనిచ్చే దిశగా కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా నిర్మాణ్ ఆర్గనైజేషన్ భాగస్వామ్యంతో ‘హోప్ ఇన్ ఏ కప్’ కేఫ్‌ను గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వైవోన్ థామ్సన్ మాట్లాడుతూ.., కేఫ్ ఏర్పాటుకు స్థలంతో పాటు మౌలిక సదుపాయాలను కల్పించనున్నట్లు తెలిపారు. రూ.25 లక్షల వ్యయంతో కేఫ్‌ను ఏర్పాటు చేసినట్లు, దీని ద్వారా వచ్చే ఆదాయం ఎల్జీబీటీ కమ్యూనిటీలోని అట్టడుగు, తక్కువ ప్రాధాన్యత ఉన్న వారి బాగోగులకు వినియోగించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నిర్మాణ్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు, ప్రెసిడెంట్ మయూర్ పట్నాల, ఓపెన్ టెక్స్ట్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ మనోజ్ నాగ్‌పాల్, సంగీత పాల్గొన్నారు.

## రిటైల్ డిపాజిట్లపై అవగాహనకు వాకథాన్

సిటీబ్యూరో, ఆగస్టు 8(నమస్తే తెలంగాణ): రిటైల్ డిపాజిట్ క్యాంపెయిన్‌లో భాగంగా ఇండియన్ బ్యాంకు ఆధ్వర్యంలో గురువారం ఇందిరా పార్కు వద్ద అవగాహన వాకథాన్ నిర్వహించారు. ఈ వాకథాన్‌ను బ్యాంకు చీఫ్ జనరల్ మేనేజర్ సుధాకర్‌రావు, ఎఫ్‌జీఎం జి.రాజేశ్వర్ రెడ్డి, జోనల్ మేనేజర్ ఎస్.శ్రీనివాస రావుతో కలిసి ప్రారంభించారు. ఈ వాక్ అంబేద్కర్ విగ్రహం, ఐమ్యాక్స్ రోడ్డు మీదుగా సాగింది.



# ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి

- సీడీఎంఏ అదనపు డైరెక్టర్ శాంసన్
- పట్టణంలోని సంఘం లక్ష్మీబాయి బాలికల పాఠశాల సందర్శన



‘స్వచ్ఛదనం- పచ్చదనం’లో పాల్గొన్న సీడీఎంఏ అదనపు డైరెక్టర్ శాంసన్

వికారాబాద్, ఆగస్టు 8 : విద్యార్థినులు ఆరోగ్యం, శుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సీడీఎంఏ అదనపు డైరెక్టర్ శాంసన్ అన్నారు. గురువారం స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ఆయన పట్టణంలోని సంఘం లక్ష్మీబాయి బాలికల పాఠశాలను సందర్శించి మాట్లాడుతూ.. విద్యార్థినులు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆరోగ్యంతోపాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కుక్కల బెడదపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల మాట్లాడుతూ.. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని సక్సెస్ చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జాకీర్‌అహ్మద్, నాయకుడు వెంకట్ రెడ్డి, మున్సిపల్ సిబ్బంది, పాఠశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వనమహోత్సవాన్ని సక్సెస్ చేయాలి
### రంగారెడ్డి జడ్పీ సీఈవో



జడ్పీ సీఈవో కృష్ణారెడ్డికి పూల బొకే అందిస్తున్న అధికారులు

మొయినాబాద్, ఆగస్టు 8 : ‘స్వచ్ఛదనం-పచ్చదనం’లో భాగంగా నేడు చేపట్టనున్న వనమహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రంగారెడ్డి జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి అన్నారు. గురువారం ఆయన మండల పరిషత్ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఎంపీడీవో సంధ్యతో గత నాలుగు రోజులుగా జరుగుతున్న స్వచ్ఛదనం-పచ్చదనం’లోని ప్రగతిపై చర్చించారు. శుక్రవారం చివరి రోజు చేపట్టనున్న వనమహోత్సవ కార్యక్రమాన్ని సక్సెస్ చేయాలన్నారు. అదేవిధంగా మండల పరిషత్‌లో పాలనాపరమైన అంశాల పై సంధ్యతో చర్చించారు.

# క్యాన్సర్.. దీర్ఘకాలిక జబ్బు
### డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ దామోదర్

మొయినాబాద్, ఆగస్టు 8 : క్యాన్సర్.. దీర్ఘకాలిక జబ్బు అని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ దామోదర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇండియన్ క్యాన్సర్ సొసైటీ సౌజన్యంతో క్యాన్సర్ నిర్ధారణ శిబిరాన్ని నిర్వహించారు. మండలంలో ని పలు గ్రామాలకు చెందిన 105 మంది హాజరై పరీక్షలు చేయించుకున్నారు. లక్షణాలు కనిపించిన పదిమందిని ఎంఎంజే క్యాన్సర్ దవాఖానకు రెఫర్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాన్సర్ లక్షణాలుగా అనుమానం ఉన్న వారు నిర్ధారణ పరీక్షలు చేయించు కోవాలన్నారు. ప్రారంభ దశలో ఉంటే మందుల ద్వారా తగ్గించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారి రాజేశ్, వైద్యులు శ్రీనివాస్, స్వర్ణలత, అన్నపూర్ణ, సీహెచ్‌వోలు సంతోష, వెంకట్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



మొయినాబాద్ : పీహెచ్‌సీలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న అధికారులు

# పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- పీఎఫ్, ఈఎస్ఐ కల్పించాలి
- పరిగి బస్టాండ్ వద్ద కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన



పరిగిలో అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న గ్రామపంచాయతీ కార్మికులు

పరిగి, ఆగస్టు 8 : గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం పరిగిలోని బస్టాం డ్ వద్ద కార్మికులు అర్ధనగ్నంగా ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ.. పంచాయతీ కార్మికులకు కనీస వేతనం నెలకు రూ.26వేలు ఇవ్వాలన్నారు. కొన్నేండ్లుగా పనిచేస్తున్న పంచాయతీ కార్మికులకు కనీస వేతనాల్లేవని, పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయాలు కల్పించలేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 8 నెలలు దాటినా ఇచ్చి న హామీలను అమలు చేయడంలేదన్నారు. పెండింగ్ వేతనాలు వెంటనే ఇవ్వాలని కోరారు. పంచాయతీ సిబ్బందికి రూ.5లక్షలు బీమా సదుపాయం కల్పించాలని, దహన సంస్కారాలకు ఇచ్చే రూ.10 వేలను రూ.30వేలకు పెంచాలని, ప్రమాదవశాత్తు కార్మికుడు మృతి చెందితే రూ.10 లక్షలు ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు శ్రీనివాస్, బందయ్య, పెంటయ్య, అంజయ్య, అర్జున్, అంజి, రాజు, వెంకటమ్మ, సుక్కమ్మ పాల్గొన్నారు.



బస్సు కోసం బొంరాస్‌పేటలో ఎదురు చూస్తున్న విద్యార్థులు

### బస్సు వచ్చేవరకు
# పడిగాపులే..

- తిరుగు ప్రయాణంలో ఇంటికెళ్లేందుకు బురాన్‌పూర్, మదన్‌పల్లి విద్యార్థుల అగచాట్లు
- చీకటి పడేదాకా బస్టాండ్‌లో నిరీక్షించాల్సిందే..
- పాఠశాల సమయాలు మారినా బస్సు వేళ లు మార్చని ఆర్టీసీ అధికారులు

బొంరాస్‌పేట, ఆగస్టు 8 : గ్రామాల నుంచి మండల కేంద్రాల్లో ఉన్న ఉన్నత పాఠశాలలు, పట్టణాల్లో ఉన్న జూనియర్, డిగ్రీ కళాశాలలకు చదువుకునేందుకు వెళ్తున్న విద్యార్థులు తిరుగు ప్రయాణంలో ఇంటికి వెళ్లాలంటే బస్సుల కోసం నిరీక్షించాల్సిందే. సమయానికి బస్సులు రాక విద్యార్థులు చీకటి పడే వరకు రోడ్లపైనే ఉంటు న్నారు. పాఠశాల సమయాలు మారినా విద్యార్థులకు అనుకూలంగా బస్సు వేళలను మాత్రం ఆర్టీసీ అధికారులు మార్చడం లేదు. దీంతో విద్యార్థులు చీకటి పడినా ఇంటికి వెళ్లలేని దుస్థితి నెలకొన్నది. మండలంలోని మదన్‌పల్లి, మదన్‌పల్లితండా, నర్స్యానాయక్‌తండా, దరికిందితండా, బురాన్‌పూర్, చెరువుముందలితండాలకు చెందిన అనేక మంది విద్యార్థులు ఉన్నత చదువుల కోసం బొంరాస్‌పేట జడ్పీ ఉన్నత పాఠశాలకు, కళాశాల చదువుల కోసం పరిగి పట్టణానికి వెళ్తుంటారు. విద్యార్థుల సౌకర్యార్థం పరిగి ఆర్టీసీ అధికారులు బస్సు సౌకర్యం కల్పించారు. ఉదయం 8 గంటలకు మదన్‌పల్లి, బురాన్‌పూర్, బొంరాస్‌పేట, తుంకిమెట్ల మీదుగా పరిగికి ఆర్టీసీ బస్సు వెళ్తుంది. తిరుగు ప్రయాణంలో మాత్రం ఇదే బస్సు బొంరాస్‌పేటకు సాయంత్రం ఏడు గంటల కు వస్తుంది. ఉన్నత, ప్రాథమిక పాఠశాలల విద్యార్థులు సాయంత్రం నాలుగు గంటలకే స్కూళ్ల నుంచి బయటికి వస్తారు. అప్పటి నుంచి వారు ఆ బస్సు కోసం మూడు గంటలపాటు నిరీక్షించాల్సి ఉంటుంది. చలి కాలంలో అయితే చీకటి పడి విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. బస్సు వేళలు మార్చాలని విద్యార్థుల తల్లిదండ్రులు ఆర్టీసీ అధికారులను పలుసార్లు కోరినా ఫలితం లేదు. విద్యార్థులు ఇంటికొచ్చే సరికే రాత్రి అయి అలసిపోతున్నారు. దీంతో ఉపాధ్యాయులు ఇచ్చిన హోంవర్క్‌నూ పూర్తి చేయలేకపోతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. ఆర్టీసీ అధికారులు ఇప్పటికైనా స్పం దించి పరిగి నుంచి మదన్‌పల్లికి సాయంత్రం వచ్చే బస్సు వేళలను మార్చాలని, మదన్‌పల్లి నుంచి బొంరాస్‌పేటకు రెండు ట్రిప్పులు నడపాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

#### ఇంటికెళ్లే సరికి చీకటి అవుతుంది



సాయంత్రం నాలుగు గంటలకు స్కూల్ నుంచి బయటి కొస్తాం. బస్సు 7 గంటలకు వస్తుంది. 3 గంటలపాటు బస్సు కోసం నిరీక్షిస్తాం. ఇంటికెళ్లే సరికి చీకటి అవుతుంది. హోంవర్క్ చేసేందు కు, చదువుకునేందుకు సమయం ఉండ డంలేదు. బొంరాస్‌పేటలో 4.30కు బస్సు ఉండేలా సమయాన్ని మార్చాలి. **-విజయ్, ఆరోతరగతి, చెరువుముందలితండా**

#### బస్సు వేళలు మార్చాలి



సాయంత్రం వేళల్లో ఇంటికొళ్లేందుకు సమయానికి బస్సు ఉండడం లేదు. ఒక్కోసారి పరిగి నుంచి 7.30 గం టలకు బస్సు వస్తుంది. అప్పటివరకు చలికి, వర్షానికి తడుస్తూ ఉండాల్సిందే. అధికారులు మా ఇబ్బందులను గుర్తించి మదన్‌పల్లి బస్సు వేళలను మార్చాలి. **-ఆంగోత్ రూపేశ్, పదోతరగతి, దరికిందితండా.**



### నిజాం కాలేజీ హాస్టల్‌ను
## యూజీ విద్యార్థినులకే కేటాయించేలా చూడాలి

నిజాం కాలేజీలోని హాస్టల్ భవనాన్ని యూజీ విద్యార్థినులకు కేటాయించాలని కోరుతూ గురువారం నిజాం కళాశాలకు చెందిన పలువురు విద్యార్థినులు మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డిని ఆమె నివాసంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. హాస్టల్ భవనాన్ని యాభై శాతం యూజీ విద్యార్థినులకు, మిగతా యాభై శాతం పీజీ విద్యార్థినులకు కేటాయించడాన్ని నిరసిస్తూ కొద్ది రోజులుగా యూజీ విద్యార్థినులు నిరసన తెలుపుతున్న విషయం విదితమే. ఈ నేపథ్యంలోనే గురువారం సబితాఇంద్రారెడ్డిని కలిసి హాస్టల్ భవనాన్ని పూర్తిగా యూజీ విద్యార్థినులకే కేటాయించేలా చూడాలని కోరారు. స్పందించిన ఆమె గతంలో చేసిన కేటాయింపుల ప్రకారమే వంద శాతం హాస్టల్ భవనాన్ని యూజీ విద్యార్థినులకు కేటాయించి న్యాయం చేయాలని నిజాం కాలేజ్ ప్రిన్సిపాల్, ప్రొఫెసర్ బీమానాయక్ దృష్టికి తీసుకెళ్లారు.
**-రంగారెడ్డి, ఆగస్టు 8 (నమస్తే తెలంగాణ)**



## పశు వైద్యశాల సందర్శన

మండల కేంద్రంలోని పశు వైద్యశాలను వికారాబాద్ జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ పూర్ణ చంద్రారావు సందర్శించారు. గురువారం ఆయన పశువైద్యశాలలో పలు రికార్డులను పరిశీలించారు. సీజన్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ధారూరు పశు వైద్యాధికారిణి డాక్టర్ శ్వేత, బాబురావు, సిబ్బంది ఉన్నారు.
**-ధారూరు, ఆగస్టు 8**



## ఇంటెలిజెన్స్ డీజీపీగా తులేకలాన్ బిడ్డ..
### హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు

ఇబ్రహీంపట్నం రూరల్, ఆగస్టు 8 : మండలంలోని తులేకలాన్ గ్రామానికి చెందిన శివధర్‌రెడ్డి డీజీపీ స్థాయి పోస్టుకు ఎంపిక కావడం ఎంతో సంతోషకరమని స్థానికులు పేర్కొంటున్నారు. తులేకలాన్ గ్రామంలో రాజ్యలక్ష్మి, రాజాకిషన్‌రెడ్డి దంపతులకు ఆయన నాలుగో సంతానంగా జన్మించారు. శివధర్‌రెడ్డి పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో ఏఎస్పీగా జీవితాన్ని ప్రారంభించి.. పలు పోస్టుల్లో పనిచేస్తూ నేడు డీజీపీ స్థాయికి ఎదగడం ఎంతో గర్వించదగ్గ విషయమని చెబుతున్నారు. వ్యవసాయ కుటుంబంలో పుట్టిన శివధర్‌రెడ్డిని రాష్ట్ర ఇంటెలిజెన్స్ డీజీపీగా ప్రభుత్వం నియమించడంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆయనకు ఏ బాధ్యత అప్పగించినా సమర్థవంతంగా పూర్తి చేస్తారని పేర్కొంటున్నారు.

### యూజీ విద్యార్థినుల నిరసనకు
# తాత్కాలిక బ్రేక్

సుల్తాన్ బజార్, ఆగస్టు 8: నిజాం కళాశాలలోని గర్ల్స్ హాస్టల్‌ను పూర్తి స్థాయిలో యూజీ విద్యార్థినులకే కేటాయించాలని చేపడుతున్న నిరసనలను విద్యార్థినులు తాత్కాలికంగా నిలిపివేశామని యూజీ విద్యార్థినులు స్పష్టం చేశారు. ఈ మేరకు గురువారం ఆరో రోజు కళాశాల యూజీ విద్యార్థులు చింత చెట్టు వద్ద ప్లకార్డులు ప్రదర్శిస్తూ విన్నూత్న రీతిలో వంటా వార్పు చేపట్టి నిరసనలు తెలిపారు. నిరసనలు ఐదో రోజుకు చేరాయి. యూజీ విద్యార్థినులకు పూర్తి స్థాయిలో హాస్టల్ వసతి కేటాయించేంత వరకు తమ పోరాటం ఆగదని విద్యార్థులు, విద్యార్థినులు చింత చెట్టు వద్ద భీష్మించారు. విద్యార్థినులు చేపడుతున్న నిరసన ప్రాంతాన్ని ఎంఎల్‌సీ బల్మూరి వెంకట్ సందర్శించి ఈ ఏడాది సెప్టెంబర్‌లో పీజీ విద్యార్థినుల అకాడమిక్ ఇయర్ పూర్తవుతుందని తదనంతరం 100 శాతం యూజీలకే హాస్టల్ కేటాయిస్తామని ఆయన యూజీ విద్యార్థినులకు సముదాయించారు. ఈ విషయమై మూడు రోజుల్లో అధికారికంగా సర్క్యులర్ జారీ చేస్తామని హామీనిచ్చారు. ఈ సందర్భంగా పీజీ విద్యార్థినులు తమకు న్యాయం చేయాలని ఎంఎల్‌సీని కోరారు. గర్ల్స్ హాస్టల్‌ను డిగ్రీ విద్యార్థినులకే కేటాయిస్తే తాము ఓయూ నుంచి రావలసి రావడంతో పాటు ట్రాఫిక్‌లో బస్సులలో సమయానికి కళాశాలకు చేరుకోలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంఎల్‌సీ బల్మూరి వెంకట్ మాట్లాడుతూ ఓయూ వీసీతో చర్చించి సమస్యను పరిష్కరిస్తానని హామీనిచ్చారు.

# ఆదివాసి గూడేలను అభివృద్ధి చెందాలి



సిటీబ్యూరో, ఆగస్టు 8(నమస్తే తెలంగాణ): సమాజంలో ఎంతో వెనుకబడి ఉన్న గిరిజనులు అభివృద్ధి చెందినప్పుడే నిజమైన అభివృద్ధి జరిగినట్టు అని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అన్నారు. గురువారం జూబ్లీహిల్స్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో రెండు రోజుల పాటు ‘గిరిజన జీవనోపాధి పద్ధతులు- సాధికారత సాధనలో సమస్యలు వ్యూహాలు’ అనే అంశంపై నిర్వహించిన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తాను స్వయంగా ఆదివాసీ ప్రాంతం నుంచి వచ్చానని, జీవితంలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నానని గుర్తు చేశారు. సదస్సులో ప్రొఫెసర్ హరగోపాల్, ఓపెన్ వర్సిటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సుధారాణి, ప్రొఫెసర్లు గుంటి రవీందర్, వడ్డాణం శ్రీనివాస్, లక్ష్మి, డైరెక్టర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి చర్యలు

చిక్కడపల్లి: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటుందని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అన్నారు. తెలంగాణ బాలోత్సవం ఆధ్వర్యంలో గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేశారు. ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలు ప్రతిభకు నిలయాలుగా ఉన్నాయన్నారు. పాఠశాలల్లో అన్ని మౌలిక వసతులు కల్పించే విధంగా కృషి చేయడం జరుగుతుందన్నారు. తెలంగాణ బాలోత్సవం అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ సభలో జాతీయ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ, మోటివేషన్ స్పీకర్ ఆకెళ్ల రాఘువేంద్ర రావు, బాలోత్సవం ప్రధాన కార్యదర్శి ఎన్.సోమయ్య పాల్గొన్నారు.